సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 25 । మే । 2025



పాలకులారా.. పట్టించుకోరా!
ఏలూరు నగరంలో వంగాయగూడెం సెంటరు నుంచి కేన్సర్ ఆసుపత్రి వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో ▸




మట్టి అక్రమ రవాణా
తూర్పుగోదావరి జిల్లా నుంచి పోలవరంలోని ఇటుక బట్టీలకు మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 8లో ▸



వైభవంగా శ్రీచక్రస్నానం
పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం విశేష పూజలు, నిత్య హోమాలు జరిపారు. గోవింద నామస్మరణల మధ్య చక్రస్నానం నిర్వహించారు. 8లో ▸

ప్రమాద ఘంటికలు

- రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్ కేసులు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న ప్రభుత్వం
- మహానాడుకు సన్నద్ధతలో టీడీపీ శ్రేణులు
- బదిలీల హడావుడిలో ఉద్యోగులు
- జిల్లా అంతటా పెళ్లిళ్ల సందడి
- ఆందోళన కలిగిస్తున్న వైరస్ వ్యాప్తి



సాక్షి, భీమవరం: కోవిడ్ మహమ్మారి మళ్లీ కోరలు చాస్తోంది. విశాఖలో ముగ్గురు, కడపలో ఒకరికి సోకింది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిస్తోంది. కడపలో మూడు రోజుల మహానాడుకు టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఉద్యోగులు బదిలీల హడావుడిలో ఉన్నారు. జిల్లా అంతటా పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఈ తరుణంలో వైరస్ వ్యాప్తించే అవకాశాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా ఎంతలా అతలాకుతలం చేసిందో తెలిసిందే. ధనిక, పేద తారతమ్యం లేదు. రేపటి రోజున ఎవరు ఉంటారో, ఎవరు పోతారో తెలీని భయానక పరిస్థితి. అయినవారి కడచూపు దక్కని దుస్థితి. 2019 కోవిడ్‌కు ముందు.. కోవిడ్‌కు తర్వాత అన్నట్టుగా పరిస్థితుల్ని మార్చేసింది. ఇప్పటికే మూడు విడతల్లో వచ్చిన మహమ్మారి తాజాగా నాలుగో పర్యాయం వస్తోంది. విశాఖపట్నంలోని ఒక కుటుంబానికి చెందిన ఇద్దరితో పాటు చికిత్స అందించిన వైద్యుడికి, కడపలో వృద్ధురాలికి సోకింది.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, గుంపులుగా చేరకూడదని, సభలు, సమావేశాలను వాయిదా వేసుకోవాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించింది. కోవిడ్ వరీక్షలు, వైద్య సేవలకు అవసరమైన పీపీఈ కిట్లు, మాస్కులు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖకు ఆదేశాలందాయి. ఈ మేరకు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం ఉంది. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని వైద్యులు చెబుతున్నారు. చలి, జ్వరం, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు.

పెళ్లిళ్లలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అంతటా పెళ్లిళ్ల సందడి ఎక్కువగా ఉంది. జూన్ మొదటివారం దాటితే ఆగస్టు వరకు పెద్ద ముహుర్తాలు లేకపోవడంతో ఈ లోగా శుభకార్యాలు పూర్తిచేసుకోవాలని భావిస్తున్నారు. ఎక్కడ చూసిన పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఎవరికి వారు మాస్కులు ధరించడం ద్వారా వైరస్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.

జనాల తరలింపులో టీడీపీ బిజీ

ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో టీడీపీ మహానాడు జరగనుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జనాన్ని తరలించే పనిలో ఆ పార్టీ నాయకత్వం ఉంది. కోవిడ్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూనే.. మరోపక్క ప్రభుత్వంలో కీలక భాగస్వామి అయిన టీడీపీ లక్షలాది మందితో మహానాడుకు ఏర్పాట్లు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనివలన వైరస్ విస్తృతంగా వ్యాప్తి చెందే అవకాశాలు లేకపోలేదని నిపుణులు అంటున్నారు.

బదిలీల హడావుడిలో ఉద్యోగులు

బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఆ హడావుడిలో మునిగిపోయారు. చాలామంది విధులను పక్కన పెట్టి తమకు కావాల్సిన చోటుకు వెళ్లేందుకు పైరవీలు చేయించుకునే పనిలో ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, హౌసింగ్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, వెటర్నరీ తదితర శాఖల్లో ఎక్కడ చూసిన ఇదే తంతు. బదిలీలకు వచ్చే నెల 2వ తేదీ వరకు గడువుండటంతో మహమ్మారి కట్టడికి వచ్చే మార్గదర్శకాల అమలు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అప్రమత్తంగా ఉన్నాం



కేసుల తీవ్రత లేనందున కోవిడ్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైద్యారోగ్యశాఖ పూర్తి అప్రమత్తంగా ఉంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు, సేవలు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం.

– జి.గీతాబాయి, జిల్లా వైద్యాధికారిణి, భీమవరం

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం కార్యదర్శిగా కృష్ణాజీ



పెచ్చెట్టి కృష్ణాజీ

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన పెచ్చెట్టి కృష్ణాజీని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణాజీకి ఈ బాధ్యతలు అప్పగించారు. కృష్ణాజీని నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు నాయకులు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ తదితరులు అభినందించారు.

యోగా శిక్షణపై శ్రద్ధ పెట్టాలి



యోగా మాస్టర్ ట్రైనీల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం/భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రజలందరకూ యోగాను క్రమపద్ధతిలో బోధించేలా యోగ శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా మంత్‌లో మాస్టర్ ట్రైనీలకు ఏర్పాటు చేసిన యోగా శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఒక్కొక్క సచివాలయం పరిధిలో ఏడుగురిని ఎంపిక చేసి వారికి ఆదివారం శిక్షణ ఇస్తామని వారి ద్వారా బ్యాచ్‌కు 50 మంది చొప్పున గ్రామాల్లో విడతల వారీగా యోగా శిక్షణా జరుగుతుందన్నారు.

నమోదుకు వెబ్‌సైట్

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ క్యూ ఆర్ కోడ్ లేదా వెబ్‌సైట్ ద్వారా నమోదు కావాలని సూచించారు.

'పది' పరీక్షకు 2,200 మంది హాజరు

భీమవరం: జిల్లాలో నిర్వహించిన పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు శనివారం 778 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. పరీక్షకు 2,978 మంది హాజరుకావాల్సివుండగా 2,200 మంది హాజరయ్యారన్నారు. ఓపెన్ పది పబ్లిక్ పరీక్షకు 158 మందికి 68 మంది గైర్హాజరుకాగా.. ఓపెన్ ఇంటర్ పరీక్షకు 208 మందికి 171 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ఏపీ ఈఏపీ సెట్ పరీక్షకు శనివారం దుయం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 170 మందికి 165 మంది హాజరు కాగా విష్ణు ఉమెన్స్ కళాశాలలో 87 మందికి 84 మంది, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో 109 మందికి 102 మంది హాజరయ్యారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 101 మందికి 95 మంది హాజరుకాగా డీఎన్నార్ అటానమస్ కళాశాలలో 100 మందికి 95 మంది హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఏపీ సెట్ ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 229 మందికి 212 మంది హాజరయ్యారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉదయం సెషన్‌లో సిద్ధార్థ క్వెస్ట్ పరీక్షా కేంద్రంలో 162 మందికిగాను 157 మంది హాజరు కాగా, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 150 మందికి 144 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 177 మందికి 173 మంది హాజరయ్యారు .

చౌక డిపోల్లోనే రేషన్ పంపిణీ

భీమవరం: ప్రభుత్వ నిర్ణయంతో జూన్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకు పంపిణీ చేస్తున్నందున జిల్లాలోని 1,052 రేషన్ షాపులు ప్రతి నెల 1 నుంచి 15 వరకు తెరిచి ఉంచాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణి ఎన్.సరోజ చెప్పారు. నిత్యావసరాల పంపిణీపై తీసుకోవాల్సిన చర్యల గురించి రేషన్ డీలర్లను ఆదేశించినట్లు చెప్పారు. రేషన్ షాపులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయాలన్నారు.

ఆక్వా క్రాప్ హాలిడేకు సిద్ధమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీభగవాన్ రాజు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారం కోసం క్రాప్ హాలిడే ప్రకటించామని ఆక్వా రైతులు ఆ దిశగా సమాయత్తమవుతున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. శనివారం స్థానిక జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం భవనంలో మాట్లాడుతూ జులై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో నిర్వహించనున్న క్రాప్ హాలిడేకు ఇప్పటి వరకూ ఆక్వా పట్టుబడులు చేసిన రైతులు తమ చెరువులను ఎండపెడుతున్నారని చెప్పారు. పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో ప్రతి గ్రామానికి చెందిన ఆక్వా రైతులందరూ క్రాప్ హాలిడేకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ప్రతి గ్రామానికి ఇద్దరు ఇంచార్జ్‌లను నియమించామన్నారు. జూన్ 10న నిర్వహించనున్న చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లుగా వనామి క్వాలిటీ సీడ్ రావడం లేదని తెలిపారు. సమావేశంలో బోణం చినబాబు, సత్యనారాయణరాజు, బోణం రంగయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల పోరుబాట

- ఏలూరులో కదం తొక్కిన సిబ్బంది
- ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడంపై మండిపాటు
- ఏలూరు జిల్లాలో వీధినపడ్డ 800 కుటుంబాలు
- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ, ఏఐటీయూసీ



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నాయకులు



రోడ్డుపై నిలిచిన ఎండీయూ వాహనాలు

ఏలూరు (టూటౌన్): ఒక్క కలం పోటుతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లను వీధిన పడేసింది. దీంతో ఎలా జీవించాలంటూ జిల్లాలోని ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు పోరు బాట పట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారనే సాకుతో కక్ష గట్టి అగ్రిమెంట్ మరో 20 నెలలు ఉండగానే తొలగించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. వాహనాలకు సంబంధించి మరో 20 ఈఎంఐలు ఎలా కట్టాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసే పక్షంలో తాము చెల్లించాల్సిన మొత్తం బకాయి ఈఎంఐలను రద్దు చేసి, తమకు ఎన్‌ఓసీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించాలని కోరుతున్నారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎండీయూ ఆపరేటర్లు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వీరి ఆందోళనకు వైఎస్సార్‌సీపీ, ఏఐటీయూసీ మద్దతు ప్రకటించాయి.

రాష్ట్రంలోని ఎండీయూ వ్యవస్థకు సంబంధించి ఆపరేటర్లకు 2027 జనవరి వరకు ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉంది. దాన్ని పక్కన బెట్టి కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి రేషన్ డీలర్ల వ్యవస్థను కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం మోసపూరితమని విమర్శిస్తున్నారు. నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ, ఈబీసీలకు చెందిన యువత ఉపాధి పొందాని.. ఎండీయూ వ్యవస్థ రద్దుతో వీరంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 394 మంది ఎండీయూ ఆపరేటర్లు, 394 మంది హెల్పర్లు ఉపాధి కోల్పోనున్నారు.

కరోనా, వరదల్లో విశేష సేవలు

రాష్ట్రంలోని ఎండీయూ ఆపరేటర్లు కరోనా సమయంలో ప్రజలకు విశేష సేవలందించారు. విజయవాడ వరదల్లో బాధిత ప్రజలకు ఆహారం, నిత్యావసరాలు సరఫరా చేయడంలో కీలకంగా పనిచేశారు. విజయవాడలో వరదల సేవలందించినందుకు అదనపు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా నేటికీ ఒక్క పైసా ఇవ్వలేదు. ఎండీయూ వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం, ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా వీరే చేస్తున్నారు. దీనికి ఎలాంటి అదనపు ప్రయోజనాలు కల్పించడం లేదు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. శనివారం భీమవరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లాలోని డీఎస్పీ, సీఐ, ఎస్సైలతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ముందుగా ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. అరెస్టులు, చార్జ్ షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లేకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల్లో ఏ విధమైన అలసత్వం వహించకుండా సత్వరం చర్యలు తీసుకోవాలని, పోక్సో, రేప్ కేసుల్లో దర్యాప్తు వేగాన్ని పెంచాలన్నారు.

పోలీస్ డాగ్ స్క్వాడ్‌కు నూతన భవనం



ఐజీ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీస్ డాగ్

ఏలూరు: పోలీస్ డాగ్స్‌కు నూతన భవనాన్ని నిర్మించడం అభినందనీయమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ డాగ్ స్క్వాడ్ భవనాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఐజీ అశోక్‌కుమార్ ప్రారంభించారు. తొలుత పోలీస్ సిబ్బంది ఐజీకి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల దర్యాప్తులో పోలీస్ డాగ్ స్క్వాడ్ పాత్ర కీలమన్నారు. ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూనే నేరాలకు పాల్పడే వారికి శిక్షలు పడేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లెదర్ కోర్సుల్లో శిక్షణకు ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు లిడ్‌కాప్–సీడ్‌యాప్ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఒక ప్రకటనలో తెలిపారు. లెదర్ స్టిచింగ్ ఆపరేటర్–లెదర్ పుట్ వేర్, లెదర్ కట్టర్ పుట్‌వేర్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 26లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని.. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 9494174417, 7981438585, 94944 77597 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. అనివేటి మండపంలో కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.



కొండపైన ట్రాఫిక్ జామ్

ఎంటీఎస్ టీచర్లు.. బదిలీల ఇక్కట్లు

ఎక్కడికి పంపుతారో తెలియని అయోమయం



దెందులూరు: మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు దశాబ్దాల పోరాటంతో కొలువు దక్కించుకున్నామనే ఆనందం ఎన్నో రోజులు మిగల్లేదు. కొన్నాళ్ళు ఏజెన్సీలో పనిచేస్తే ఆ తరువాత స్వగ్రామాలకు సమీపంలో పోస్టింగ్ ఇస్తామని చెబితే ఉద్యోగాల్లో చేరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇచ్చారనే ఏకైక కారణంతో కూటమి ప్రభుత్వం విషం కక్కుతోంది. టీచర్ల బదిలీలకు తెరలేపిన ప్రభుత్వం, ఎంటీఎస్ టీచర్లను గాల్లోపెట్టి, వారు పనిచేస్తున్న స్థానాలను ఖాళీలుగా చూపించారు. దీంతో మళ్ళీ ఎక్కడికి పోవాలో తెలియక సతమతమవుతున్నారు. న్యాయపరమైన సమస్యల్ని పరిష్కరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ–98 అభ్యర్థులు 274 మంది సెలెక్ట్ అయ్యారు. వారికి వేలేరుపాడు, కుక్కునూరు, టీ.నర్సాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, ఏజెన్సీ ప్రాంతాల్లో దాదాపు వంద మందికి పైగా పోస్టింగులు ఇచ్చారు. మిగిలిన వారికి జిల్లాలో ఇతర ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చారు.

జీతం తక్కువ.. పని ఎక్కువ

రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.32,470 వేతనం చెల్లిస్తున్నారు. దీంతో సొంత మండలాలు, లేదా సమీప మండలాల్లోని స్కూళ్లలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది. దశలవారీగా వారిని మైదాన ప్రాంతానికి తీసుకురావాలని అప్పటి ప్రభుత్వం విద్యాశాఖాధికారులకు దిశానిర్దేశం చేసింది. ప్రస్తుతం టీచర్ల బదిలీల నేపథ్యంలో 274 ఎంటీఎస్ స్థానాలను ఖాళీలుగా చూపారు. దీంతో రెగ్యులర్ టీచర్లు కోరుకోగా మిగిలిన ఖాళీలు మాత్రమే వీరికి దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో బడులు తెరిచాక.. ఎక్కడికి వెళ్ళాల్సి వస్తుందో తెలియని అయోమయంలో ఎంటీఎస్ టీచర్లున్నారు.

పోస్టింగుపై ఆందోళన



పోస్టింగ్ ఏ ప్రాంతంలో ఇస్తారోనని నాతో పాటు కుటుంబం ఆందోళనగా ఉంది. ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో ఉద్యోగంలో చేరాను. ఈ ఏడాది అయినా మంచి ప్రాంతంలో పోస్టింగ్ ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాను.

– రాజ్యలక్ష్మి, టీచర్, కుక్కునూరు

రిటైర్‌మెంట్ సమయంలోనైనా..



రిటైర్‌మెంట్ సమయంలోనైనా అనుకూలమైన ప్రాంతంలో పోస్టింగ్ ఇస్తారని ఆశిస్తున్నాను. ఎప్పుడు వెళ్ళాలో.. ఎక్కడికి వెళ్ళాలో.. ఎప్పుడు మకాం మార్చాలో తెలియదు. రిటైర్‌మెంట్ ముందుగా కూడా బాధలు తప్పేలా లేదు.

– ఎస్.రాజకుమార్, టీచర్, ఆకివీడు

కుటుంబ పరిస్థితులను పరిగణించాలి



ప్రభుత్వం బదిలీలు చేసే ఉపాధ్యాయులను వారి కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. నిబంధన అనేది ఉపాధ్యాయులు, వారి కుటుంబం ఇబ్బందిపడేలా ఉండకూడదు.

– స్వర్ణలత, టీచర్

క్లుప్తంగా

మద్ది క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం



విశేష అలంకరణలో కల్యాణమూర్తులు

జంగారెడ్డిగూడెం: మద్ది క్షేత్రంలో ఉపాలయమైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆంజన్నకు ప్రభాత సేవ, నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణలు నిర్వహించారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ముఖ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహించారు. నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేశారు. ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి స్వామి వారి ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించబడునని దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందినట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన సైదు గంగ శనివారం ఉదయం గేదెలను మేపడానికి ఇంటి నుంచి బయల్దేరింది. మధ్యాహ్నానికి కూడా ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు తేజ, అతని స్నేహితుడు కలిసి గాలించారు. అయితే, గ్రామంలోని క్వారీ చెరువులో గంగ మృతదేహం తేలియాడి కనిపించినట్లు ఆమె కుమారుడు తేజ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

జీలుగుమిల్లిలో పట్టపగలే చోరీ

బుట్టాయగూడెం: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగిన ఘటన జీలుగుమిల్లిలో జరిగింది. బాధితుడు సాదు చిన్నారావు తెలిపిన వివరాలు ఇవి. గ్రామానికి చెందిన చిన్నారావు జీడిగింజలు, పత్తి వ్యాపారం చేస్తుంటాడు. శనివారం అతని భార్య ఇంటికి తాళం వేసి సెంటర్‌లో షాపునకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపలకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలకొట్టి ఉన్నాయని, అందులో వెండి, బంగారం మాయమైనట్లు గుర్తించినట్లు బాధితులు చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పాలకులారా.. పట్టించుకోరా!



పెదపాడు వెళ్లే రోడ్డులో నరకం చూడాల్సిందే

ఈ గుంతల రోడ్లు చూశారా.. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు. ఏలూరు నగరంలో వంగాయగూడెం సెంటరు నుంచి కేన్సర్ ఆసుపత్రి వరకు ఉన్న రోడ్డు ఇలా గోతులతో అధ్వానంగా తయారైంది. ఎన్నికలకు ముందు మైక్ పట్టుకుంటే ఓట్లు వేయండి.. రోడ్లు వేసి చూపిస్తామని అంటూ కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా ఓట్లు వేశాక రోడ్ల సంగతి మరిచారు. నిత్యం గోతులమయంగా ఉన్న ఈ రోడ్లలో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తరోడ్డు దేవుడెరుగు... కనీసం ఆ గుంతలైనా పూడ్చండి అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్/ఏలూరు



పూర్తిగా దెబ్బతిని గోతులమయంగా కేన్సర్ హాస్పటల్ రోడ్డు



ఈ రోడ్డులో తిరిగితే వాహనాలు షెడ్డుకు వెళ్లాల్సిందే



ఏలూరు జూట్‌మిల్లు వంతెన వద్ద భారీ గొయ్యి



వంగాయగూడెం సెంటరులో దెబ్బతిన్న రోడ్డు



ఇటుగా వెళితే అంబులెన్స్ ఎక్కాల్సిందే..

పారిజాతగిరిలో వైభవంగా శ్రీచక్రస్నానం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం విశేష పూజలు, నిత్య హోమాలు జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని సుదర్శన్ పెరుమాళ్లను తోడుకొని వెళ్లి యజ్ఞ బ్రహ్మ పానంగిపల్లి సత్య పవన్, ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వసంతోత్సవం, చూర్ణోత్సవం, నిర్వహించి అనంతరం యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. తరువాత భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ సుదర్శన్ పెరుమాళ్లను కోనేరు వద్దకు తీసుకువెళ్లి చక్రస్నానం నిర్వహించారు. భక్తులు సైతం సుదర్శన్ పెరుమాళ్‌తో సహా స్నానమాచరించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి గజ వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ధ్వజ అవరోహణం గావించారు. కార్యక్రమంలో



పారిజాతగిరి ఆలయంలోని కోనేరు వద్ద చక్రస్నాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతి రాజు, సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, రెడ్డి రంగ ప్రసాద్, దండు ధనరాజు, వాసవి సాయి నగేష్, బూరుగుపల్లి రవీంద్ర, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాల ఏర్పాట్లను కార్య నిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఏలూరు సర్ సీఆర్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-23, సీనియర్ మెన్ క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నియమించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడహక్ కమిటీ సభ్యులు ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, సీఈ ఆశోక్‌కుమార్, ఎస్‌కె సమీర్‌హుసేన్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న అండర్-23 జట్టు, 30వ తేదీన సీనియర్ మెన్ జట్టు ఎంపిక చేపడతామని వెల్లడించారు. 2002 సెప్టెంబర్ 01 తర్వాత పట్టిన వారు అండర్-23 జట్టుకు అర్హులన్నారు. సీనియర్ జట్టుకు వయోపరిమితి లేదు. ఆసక్తి గల క్రీడాకారులు సొంత కిట్‌తో పాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. జట్లుకు ఎంపికైన వారు తర్వలో జరగబోయే సెంట్రల్ జోన్ ఇంటర్ డ్రిస్టిక్ట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఫిర్యాదుల పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలు సంతృప్తి చెందే విధంగా ఉండాలని రాష్ట్ర చీఫ్ గ్రీవెన్స్ అధికారి సీహెచ్ చిన్నారావు అన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ తదితర అంశాలపై శనివారం అమరావతి సీఎంఓ కార్యాలయం నుంచి చిన్నారావు జూమ్ ద్వారా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డితో పాటు డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ భీమారావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై. దోసిరెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఓఎల్‌ఎక్స్‌లో ఫ్రిజ్ విక్రయానికి బేరం.. ఆన్‌లైన్‌లో నగదు మాయం

ఏలూరు టౌన్: ఓ వ్యక్తి ఓఎల్‌ఎక్స్‌లో తన పాత ఫ్రిజ్ విక్రయానికి ప్రయత్నించగా అవతలి వ్యక్తి అతడిని బురిడీ కొట్టించి డబ్బులు కాజేసిన ఘటన ఇది. వివరాల ప్రకారం.. ఏలూరు ఎన్‌ఆర్ పేటకు చెందిన మానుకొండ సాయికృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఏలూరులోని తన ఇంట్లో ఉన్న పాత ఫ్రిజ్‌ను విక్రయానికి ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన పెట్టారు. దీంతో ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను ఆర్మీ ఉద్యోగినని ఫ్రిజ్ కొంటానని బేరం మాట్లాడుకున్నాడు. ఈ నేపథ్యంలో ఫోన్ నంబర్ నిర్ధారణకు రూ.2 ఫోన్ పే చేశానని చెప్పాడు. తనకు రాలేదని సాయికృష్ణ చెప్పడంతో అయితే తన నెంబర్ పనిచేయడం లేదని యూపీఐ స్కానింగ్ నెంబర్ వాట్సాప్‌లో పెడుతున్నానని దానికి పిన్ ఎంటర్ చేయాలని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన సాయికృష్ణ వాట్సాప్‌లో వచ్చిన స్కానర్‌కు యూపీఐ పిన్ ఎంటర్ చేయగా వెంటనే సాయికృష్ణ ఖాతాలోని రూ.92 వేలను అపరిచిత వ్యక్తి కాజేశాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన సైబర్ క్రైమ్ పోలీసులు సాయికృష్ణ ఖాతాను పరిశీలించగా అప్పటికే అపరిచిత వ్యక్తి రూ.30 వేలు డ్రా చేసేశాడు. రూ.62 వేలు సొమ్మును సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ ఫిర్యాదు చేయగా సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలు దాటి మట్టి అక్రమ రవాణా

పోలవరం రూరల్ : జిల్లాలు దాటి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట గ్రామ పరిసర ప్రాంతాల నుంచి ఏలూరు జిల్లా పోలవరంలోని ఇటుక బట్టీలకు మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేయడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మార్గమధ్యలో వీఆర్వో మట్టి లారీలను ఆపి తనిఖీలు చేశారు. లారీలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలను ఆపిన సమయంలో మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులు రెవెన్యూ, పోలీసు సిబ్బందిపై కొంత సేపు ఘర్షణకు దిగారు. ఈ ఘటనపై పోలవరం తహసీల్దార్ సాయిరాజును అడగ్గా మట్టి రవాణా చేస్తున్న లారీలకు సంబంధించి జరిమానా విధిస్తామన్నారు. చట్టవ్యతిరేకంగా మరోసారి మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాక కేసులు నమోదు చేస్తామన్నారు.

అజ్ఞాత వ్యక్తి సమాచారంతో వెలుగులోకి హత్య

- 4న చినరంగనిపాలెంలో వ్యక్తి హత్య
- అనుమానంతో హత్యకు పాల్పడిన సన్నిహితుడి కుటుంబం
- అజ్ఞాత వ్యక్తి సమాచారంతో కూపీ లాగిన పోలీసులు
- నిందితుల అరెస్ట్



మృతుడు కాటూరి దుర్గారావు (ఫైల్)



భీమవరంలో హత్య వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: అజ్ఞాతవ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఓ వ్యక్తి హత్య ఘటన వెలుగులోకి వచ్చింది. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చినరంగనిపాలెంలో చోటుచేసుకున్న హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య శనివారం వెల్లడించారు. పట్టణంలోని చినరంగనిపాలెం ప్రాంతానికి చెందిన కాటూరి దుర్గారావు(28) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహం కాగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్న దుర్గారావుకు రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన యల్లా కోటేశ్వరరావు(బాబి)తో పరిచయమైంది. కోటేశ్వరరావు కూడా మొదటి భార్యతో విడిపోయి షేక్ మేరీని రెండవ వివాహం చేసుకున్నాడు. షేక్ మేరీకి కూడా ఇది రెండో వివాహమే. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. బాబి, మేరీ, ఆమె ఇద్దరు కుమారులతో చినరంగనిపాలెంలోనే నివాసముంటున్నారు. వీరింటికి దుర్గారావు తరచూ వస్తుండేవాడు. దీంతో తన భార్య మేరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఇంటిలో దొంగతనం చేస్తున్నాడనే అనుమానంతో దుర్గారావు హత్యకు బాబి పథకం రచించాడు.

పథకం ప్రకారం హత్య

ఈనెల 4వ తేదీన పట్టణంలోని నర్సయ్యఅగ్రహారంలో తన సోదరుడు కాటూరి నాగరాజు ఇంటివద్ద దుర్గారావు ఉండగా దొంగతనం చేశాడంటూ ఆరోపిస్తూ.. బాబి, తన కుమారుడు ఇంటికి తీసుకువెళ్లారు. అక్కడ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం దుర్గారావును సుత్తి, ఇనుపరాడ్‌తో బాబి, మేరి వారి కుమారుడు జాన్ తీవ్రంగా కొట్టారు. అనంతరం కాళ్లు, చేతులు కట్టి, నోటిలో గుడ్డలు పెట్టి సంచితో మూటకట్టారు. దుర్గారావు చనిపోయాడని భావించి మృతదేహాన్ని ఖననం చేయడానికి బాబి స్వగ్రామమైన కోనసీమ అంబేడ్కర్ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురేశ్వరం గ్రామంలో శ్మశానవాటిక వద్దకు ఆటోలో తీసుకువెళ్లారు. అక్కడ మూటవిప్పి చూడగా దుర్గారావు కొన ఊపిరితో ఉండడంతో మళ్లీ తీవ్రంగా కొట్టి హత్యచేశారు. అనంతరం మృతదేహాన్ని మోటారు సైకిల్‌పై జొన్నాడ గ్రామంలోని కోటిపల్లికాలువలో పడవేశారు.

నిందితుల అరెస్ట్

ఈనెల 20వ తేదీన పోలీసులకు ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. దుర్గారావు కనిపించడంలేదని తెలిపారు. దీంతో సీఐ నాగరాజు దుర్గారావు గురించి ఆరా తీశారు. అతని సోదరుడు నాగరాజును పిలిపించి విచారించారు. అనంతరం ఈనెల 21న అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుర్గారావు అదృశ్యంపై కేసు నమోదు చేశారు. తర్వాత పోలీసులు కూపీ లాగడంతో హత్య ఉదంతం బయటపడింది. నిందితులపై కేసు నమోదుచేయగా శనివారం బాబి, మేరీలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ జయసూర్య చెప్పారు. మరో నిందితుడు జాన్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. విలేకర్ల సమావేశంలో వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్సై కృష్ణాజీ పాల్గొన్నారు.

కారు ఢీకొని దివీస్ ఉద్యోగిని దుర్మరణం

తగరపువలస (విశాఖ జిల్లా): సంగివలస వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా చాట్రాయి మండలం ఎర్రవారిగూడేనికి చెందిన ఉప్పలపాటి తిరుమలాదేవి (24) అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన పిల్లి వెంకటేష్ కారులో కాకినాడ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వైపు వెళ్తున్నారు. కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్లింది. కాగా.. భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్‌గా పనిచేస్తున్న తిరుమలాదేవి విధులకు హాజరయ్యేందుకు మరో ముగ్గురు సహోద్యోగినులతో కలిసి అనిట్స్ బస్టాప్ వద్దకు చేరుకుంది. తాము ఎక్కాల్సిన ప్రైవేట్ బస్సు అప్పటికే ఆనందపురం వైపు వెళ్లిపోయింది. ఆనందపురం వైపు నుంచి తిరిగి వస్తున్న అదే బస్సును పట్టుకోవడానికి ఆమె రోడ్డు దాటుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు తిరుమలాదేవిని బలంగా ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో ఆమె తల ఛిద్రమై తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మిగతా ముగ్గురు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. తిరుమలాదేవి మూడేళ్లుగా దివీస్‌లో కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. సంగివలసలోని ఆరాధ్య హాస్టల్‌లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. సమాచారం అందుకున్న భీమిలి ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దివీస్ ఉద్యోగి కడియాల పవన్ కుమార్ ఫిర్యాదుతో ఎస్సై రాధాకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో ప్రమాదానికి కారణమైన కారు, ఇన్‌సెట్‌లో తిరుమలాదేవి (ఫైల్)

శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు కొత్త భవనాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిలాల్లో శిథిలావస్థలో ఉన్న 4 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు రూ.12 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి చెప్పారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని కై కలూరు, పెదపాడు, గుండుగొలను, ముదినేపల్లిలలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థానంలో రూ.12 కోట్లతో కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని 52 భవనాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.72 కోట్లు మంజూరు చేసిందని, మరమ్మతు పనులను పంచాయతీరాజ్, రహదారులు, భవనాలు, సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం, సర్వశిక్షా అభియాన్, పబ్లిక్ హెల్త్ శాఖలకు అప్పగించడం జరిగిందన్నారు. 90 శాతం మేర పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు జూన్ మొదటి వారం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హాస్టళ్లలోని విద్యార్థుల రక్షణ నిమిత్తం 56 హాస్టళ్లలో 448 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో హాస్టళ్లలో 6,900 మంది విద్యార్థుల చేరిక లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, మద్యం, నగదు అక్రమ రవాణాను నియంత్రించేలా నిత్యం వాహన తనిఖీలు చేయాలని ఆదేశించారు. నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, శక్తి పోలీస్ టీమ్స్ మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై దర్యాప్తును వేగవంతం చేస్తూ కేసులను పరిష్కరించాలని సూచించారు.

కార్యాలయం తనిఖీ

తొలుత ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీస్ ప్రధాన కార్యాలయంలోని రిసెప్షన్ కౌంటర్‌లో ప్రజలకు ఎలాంటి సేవలు అందుతున్నాయో ఆరా తీశారు. ఏఆర్, డాగ్ స్క్వాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్, డ్రోన్స్ కెమెరాల నిఘా విభాగం, హోమ్ గార్డ్స్ విభాగాల్లోనూ తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, ఫింగర్ ప్రింట్స్ విభాగాల్లోనూ తనిఖీలు చేసి ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. జిల్లాలో కేసుల ఛేదనపై ఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

యోగాతో మానసిక ఉల్లాసం



గూడెం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో యోగా క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: యోగాతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖలో వచ్చే నెల 21న చేపట్టిన యోగా డే రికార్డు పురస్కరించుకొని ప్రజలను సన్నద్ధం చేస్తున్నట్లు యోగా శిక్షకురాలు జి.రూప తెలిపారు. గత కొద్ది రోజులుగా గూడెం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో యోగా శిక్షణ ఆమె ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-25 పురస్కరించుకొని ప్రత్యేక థీమ్‌తో చేపట్టిన ప్రచార ఉద్యమంలో భాగంగా విద్యార్థులను, గృహిణులను, పెద్దలను యోగామంత్‌కు సిద్ధం చేసేలా శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగా థీం ప్రాజెక్టులో పాల్గొనాలనుకొనే ఆశక్తి ఉన్నవారు ఉదయం తప్పక పాల్గొనాలన్నారు.

'గూడెం'లో 42.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట గ్రామంలో వర్షానికి నీట మునిగిన వీధి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 24 గంటల్లో 42.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 34.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

వరాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాలనుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

టిడ్కో సమస్యలు పరిష్కరిస్తాం



టిడ్కో నివాసితులతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: టిడ్కో గృహస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు హామీ నిచ్చారు. శనివారం టిడ్కో కాలనీని ఆయన సందర్శించారు. గతంలో ఈ ఇళ్ల విషయంలో జరిగిన తప్పిదాలను సరిచేసి, సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ నిచ్చారు. అధికారులు ఆయన వెంట ఉన్నారు. మారిశెట్టి ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో సీఎం సహాయనిధి కింద వచ్చిన సుమారు కోటి 20 లక్షల రూపాయల చెక్కులను 150 మందికి పంపిణీ చేశారు.భవన నిర్మాణ కమిటీ భవనంలో జరిగిన సమావేశంలో 108 ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం విడుదల చేసిన 276జీఓ వల్ల 108 ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

పడాలలో ముగిసిన సువార్త సభలు

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక శక్తి ద్వారానే దేవుని ప్రసన్నత సాధ్యమని అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు పడాల మార్కెట్ యార్డు వద్ద జరిగిన క్రీస్తు సువార్త రక్షణ స్వస్తత సభలు శనివారంతో ముగిసాయి. ముగింపు రోజు పురస్కరించుకొని బ్రదర్ అనిల్ కుమార్ హైదరాబాద్ నుంచి పడాల సభకు వచ్చిన విశ్వాసులతో లైవ్‌లో మాట్లాడారు. జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె. జాజిరాజు, సంఘ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో ఈ సభలను నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో హైదరాబాద్ కల్వరి చర్చికి చెందిన జోసఫ్ ప్రకాష్, బ్రదర్ ఎనోష్‌కుమార్‌లు ఈ సభలలో దేవుని వాక్యం బోధించారు. పాస్టర్ ఘనరాజు, చర్చి యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇకపై పడిగాపులే..!

- రేషన్ బండి సేవలకు మంగళం
- ఇంటింటా రేషన్‌కు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- ఆందోళనలో లబ్ధిదారులు
- రోడ్డున పడ్డ ఎండీయూ ఆపరేటర్లు



తణుకులో రేషన్ అందజేస్తున్న ఎండీయూ వాహనం (ఫైల్)

తణుకు అర్బన్: పేద, సామాన్య వర్గాలకు చెందిన లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మరో పెద్ద షాక్ ఇచ్చింది. నిన్నటి వరకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసే ఎండీయూ (రేషన్ బండి) వాహనం సేవలను నిలిపివేస్తూ ఆదేశాలు చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వాహనాలను నిలిపివేస్తున్నట్లుగా ప్రకటించడంతో ఇంటి గుమ్మంలో అందుకునే బియ్యం ఇక రేషన్ డిపోల వద్ద క్యూలో నిల్చోవాల్సిందేనా మరలా పాతరోజులు వచ్చేస్తున్నాయా అంటూ ప్రజానీకం హడలెత్తిపోతున్నారు. జూన్ 1 నుంచి వాహన సేవలు ఆగిపోతున్నాయన్న వార్త ప్రజలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రేషన్ డిపోల వద్ద నిలబడలేక, సర్వర్ బాలేదని పదేపదే తిరగాల్సి రావడం, బియ్యం మూటలు మోయలేక కూలబడిపోవడం వంటి రోజులు మళ్లీ వచ్చేస్తున్నాయని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు.

మన్ననలు పొందిన ఎండీయూ సేవలు..

ప్రజాసంకల్పయాత్రలో గుర్తించిన సమస్యను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

	ఎండీయూ	డిపోలు	రేషన్ కార్డులు
తణుకు మండలం	27	72	42850
అత్తిలి	15	38	21891
ఇరగవరం	13	38	21968

ప్రభుత్వం ఏర్పాటుకాగానే రాష్ట్ర వ్యాప్తంగా వాహనాలను కొనుగోలు చేసి ఎండీయూగా నామకరణం చేయడం వాహనాలకు ఆపరేటర్, ఒక అసిస్టెంట్‌ను ఏర్పాటుచేసి గడపలోకి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎండైనా, వర్షం వచ్చినా సరే ఇంటిగుమ్మంలోకి వచ్చి బయోమెట్రిక్ వేయించుకుని వాహనంలోని బియ్యాన్ని అందించే వాహనాల సేవలను



తణుకులో ఇంటిగుమ్మంలోకి వెళ్లి వృద్ధులతో బయోమెట్రిక్ వేయిస్తున్న ఆపరేటర్(ఫైల్)

నిలిపివేయడంపై కూటమి ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఐదేళ్లుగా ఇంటి గుమ్మంలోకి వెళ్లి బియ్యం ఇచ్చాం



గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎండీయూ వాహనాల ద్వారా మాకు నిర్దేశించిన పరిధిలోని ఇంటి గమ్మంలోకి వెళ్లి రేషన్ సరుకులు అందించాం. గతంలో క్యూలో ఉండాల్సి వచ్చేదని ఇంటి గుమ్మంలోకి బాగానే తీసుకువచ్చి ఇస్తున్నారంటూ లబ్ధిదారులు చాలా సంతోషించారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ వాహన సేవలను తొలగించి మమ్మల్ని రోడ్డున పడేయడమే కాకుండా ప్రజలకు కష్టాలను చూపించేందుకు సిద్ధమయ్యారు.

– కొల్లి బాబు, ఎండీయూ వాహన అసోసియేషన్ తణుకు మండల అధ్యక్షుడు

ఎండీయూ ఆపరేటర్లంతా రోడ్డున పడ్డాం



కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిన నిర్ణయంతో ఎండీయూ ఆపరేటర్లంతా రోడ్డున పడ్డాం. ప్రజలకు నేరుగా అందుతున్న సేవలను నిలిపివేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మంది ఆపరేటర్లకు ఉపాధి లేకుండా చేశారు. బాబు వస్తే జాబు వస్తుందంటూనే ఉన్న ఉపాధి లాగేసుకోవడం ఎంతవరకు న్యాయమో చెప్పాలి. ఎండీయూ వాహనాలను ప్రారంభించిన వెంటనే అప్పట్లో ఉన్న ఉపాధిని వదిలేసి ఈ వాహనాలతో బియ్యం అందిస్తూ ఉపాధి పొందుతున్న మా ఆపరేటర్లపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని తిరిగి సేవలను పునరుద్ధరించాలి.

– గెల్లా జగన్, ఎండీయూ వాహన అసోసియేషన్ తణుకు మండల ఉపాధ్యక్షుడు

పాత రోజులు వస్తున్నాయి



గతంలో రేషన్ డిపోలో బియ్యం తెచ్చుకునేందుకు రోజుల తరబడి గంటల వ్యవధిలో క్యూలో నిలబడాల్సి వచ్చేది. కానీ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటిగుమ్మంలోకే బియ్యం, సరుకులు అందచేశారు. కానీ నేడు ఆ వాహనాలను తొలగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న కారణంగా నేడు మరల పాత రోజులు వస్తున్నట్లుగా ఉన్నాయి. ఇక మరల రేషన్ డిపోల ముందు నిలబడాలి, బియ్యం మూటలను నెత్తిన పెట్టుకుని ఇళ్లకు మోసుకువెళ్లాల్సిందే అనుకుంట.

– వై.రామకృష్ణ, తణుకు

రోడ్డునపడ్డ ఎండీయూ ఆపరేటర్లు...

గత ఐదేళ్లకుపైగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు గుమ్మంలోకి అందించి ఉపాధి పొందుతున్న కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు సందర్భాల్లో ఎండీయూ వాహనాలపై ఆరోపణలు, అపోహలు వెలువరించిన ప్రభుత్వం వాహన సేవలు బాగుఉన్నాయంటూనే ఎట్టకేలకు తొలగింపు నిర్ణయం తీసుకోవడంతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందడమే కాకుండా ఉపాధి పొందుతున్న ఆపరేటర్లు రోడ్డుపాలయ్యామంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ ఆపరేటర్లు నిరసనలు తెలుపుతూ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీ, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 55 వాహనాలు ఉండగా 55 మంది ఆపరేటర్లు, 55 మంది అసిస్టెంట్‌లు, 148 రేషన్ డిపోల పరిధిలో 86,709 రేషన్ కార్డుదారులకు బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్లంపై శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడించడం, నీతికథలు చెప్పించడడంపై రిసోర్సుపర్సన్ బి నాగేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. పెద్ద బాలశిక్షపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పెద్దబాల శిక్షను చదవడం అలవాటు చేసుకోవాలని కోరారు. విలువలతో కూడిన జీవన విధానం, పెద్దబాలశిక్ష ద్వారా అలవడుతుందన్నారు. ఈసందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, జి శేషవేంద్రరావు, వి లక్ష్మణరావు, ఎస్ దుర్గా ప్రసాద్, దివ్యసత్యశ్రీ, గాయత్రి, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబరంలో విద్యార్థులు

గ్రేడ్–1 గ్రంథాలయంలో ఆసక్తికరంగా శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో శనివారం ఆసక్తికరంగా శిక్షణ తరగతులు జరిగాయి. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్ధనరావులచే కథలు, పుస్తక పఠనం, సైన్స్, పొడుపు కథలు, విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. జి.బాపయ్య శర్మచే విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శతాధిక వృద్ధురాలు రామాయమ్మకు నివాళులు






సంతాపం ప్రకటిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ప్రముఖులు గుండుమోగుల బలుసులరావు తల్లి రామాయమ్మ (101) వృద్ధాప్యంతో మృతి చెందారు. జువ్వలపాలెంలో శనివారం ఆమె చిత్రపటం వద్ద మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నాయకులు వలవల బాబ్జి, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, గంధం సతీష్, పరిమి రవికుమార్, ఎఫ్ఎఫ్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ గోయాంకా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలి

న్యాయమూర్తి డి.సత్యవతి



తణుకు అర్బన్: లైంగిక వేధింపుల్లో మహిళలు తమ సమస్యను ధైర్యంగా ఎదిరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న మహిళలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని అన్నారు. అంతర్జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్‌డే సందర్భంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా పిల్లలు తప్పిపోయిన సందర్భాల్లోను వెంటనే స్పందించి పోలీసులు, 1098 చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉచిత న్యాయసలహాలు అందజేసేందుకు మండల న్యాయసేవాధికార సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పోతర్లంక సాయిరాం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్ కుమార్, పోలీసు, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు తొలగించుకోవాలి

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి ఆవరణలోను అనవసర నీటి నిల్వలను తొలగించుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు సొసైటీరోడ్డులో శనివారం నిర్వహించిన గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, ఫ్రైడే డ్రైడేపై ఇంటింటికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉండే రుబ్బురోళ్లు, ఇతర సామగ్రిలో దోమ లార్వా పెడుతుందని చెప్పారు. అనంతరం ఇంటి పరిసరాల్లో ఉన్న దోమ లార్వాలను గుర్తించి నీటిని తొలగింపచేశారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ కె సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ వి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో దోమల వ్యాప్తి చెందే పరిస్థితులను వివరిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

కాలువలో ఎక్కడి చెత్త అక్కడే

తొలగించాలని కోరుతున్న ప్రజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి కావడంతో పట్టణం మధ్యలో నుంచి వెళ్తున్న ఏలూరు కాలువను ఆయా పనులు నిమిత్తం నెల రోజులు కట్టేశారు. ప్రస్తుతం కాలువలో నీరు గణనీయంగా తగ్గిపోయింది. కాలువ కాసారంగా మారింది. కాలువలో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలతో ఎండుపోయిన మొక్కలు, గుడ్డలు, ఇతర వ్యర్థాలు స్పష్టంగా కానవస్తున్నాయి. కాలువ నీరు సైతం పసర్లు ఎక్కి ఉండటంతో పాటు పట్టణంలోని కాలువ పొడవునా ఇరువైపుల అపరిశుభ్రత వాతావరణం తాండవిస్తుంది. అదే విధంగా పట్టణంలోని అన్ని స్నానాలు చేసే రేవులు వద్ద నీరు లేకపోవడంతో ముందుకు సాగేందకు వీలు లేక ఎక్కడ వ్యర్థాలు అక్కడే ఆగిపోయాయి. ఆయా వ్యర్థాలు స్నానాలు చేసే రేవు మెట్లు వరకు వచ్చి చేరాయి. గతంలో కాలువ కట్టినప్పుడు అవసరాన్ని బట్టి కాలువకు సుందరీకరణ పనులు చేసేవారు. చెత్త చెదారాలను తొలగించడంతో పాటు కాలువ గట్లు ఎత్తు పెంచేవారు. ప్రస్తుతం సుందరీకరణ పనులు లేవు. వచ్చే నెల మొదటి వారంలో కాలువ విడుదల అయ్యే అవకాశాలు ఉన్నందున దీనిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు కనీసం స్నానాలు చేసే రేవులనైన శుభ్రం చేసి మెట్లు వద్ద వ్యర్థాలను తొలగించి, ప్రజలు స్నానాలు చేసేందుకు అనువుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్త చెదారాలతో స్థానిక ఏలూరు కాలువ



పెద్ద శివాలయం వద్ద కాలువ మెట్లు వద్ద వ్యర్థాలు

పెండింగ్ బకాయిలను తక్షణం చెల్లించాలి

అత్తిలి: ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి. బళ్ళ చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా శనివారం అత్తిలి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. గత రెండు మాసాలుగా చేసిన పనికి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వాలు ఇటువంటి దుర్మార్గమైన విధానాలు తీసుకొచ్చి ఉపాధి హామీ నుండి కూలీలను దూరం చేసి, కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు దారి మళ్లించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు కూలీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని. కూలీలకు ఇబ్బందిగా ఉన్న ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొరుచంద్రకళ, వీరవల్లి విజయలక్ష్మి. గుత్తుల హేమ. బొక్క వరలక్ష్మి. కాంట్రేగుల ఉమామహేశ్వరి. బొంతు శ్రీను. చేబ్రోలు వెంకటలక్ష్మి. బొంతు సీతారత్నం, మట్టపర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉనికిలిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మద్యం, మత్తు పదార్థాలపై యువత తప్పక అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక దేవి డి అడిక్షన్ సెంటర్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మత్తు పదార్థాలు, అనర్థాలు, మద్యం తీసుకోరాదని, గంజాయిలు సేవించరాదని తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించారు.

అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కేవీఎస్ ప్రభుకుమార్, జిల్లా సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమారేస్వరన్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు ఆర్‌బీ ప్రసాద్ రెడ్డి, ఈ.స్వరాజ్యలక్ష్మిలు మాట్లాడాతూ మత్తు పదార్థాలు వల్ల కలిగే నష్టాలను వెల్లడించారు. చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా దేవి డి అడిక్షన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై దొరబాబు, జి.మురళీ, మల్లిపూడి దేవి, మిత్ర, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కె.బాలకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి అవుతున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ సంఘ భవనంలో శనివారం అసోసియేట్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఇహెచ్ఎస్ఆర్ కార్డులో అన్ని రకాల రోగాలకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ. 2 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచాలని, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య సదుపాయాలు అమలు చేయాలన్నారు. డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు, అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరణకు, 30 శాతం ఇంటరీయమ్ రిలీఫ్ చెల్లించాలని తదితర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.వీ. సత్యనారాయణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ఎండీ మస్తాన్, ఎం.అర్జునరావు, వి.విశ్వంరాజు, కృష్ణ కుమారి, మూర్తి, వంగపండు, రామ్మోహన్ రావు, ఐవీ ప్రసాద్‌రాజు తదితర సభ్యులు పాల్గొన్నారు.